## నేడు శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

దహెగాం, జూన్ 8 : మండలంలోని చిన్నరాస్పల్లిలో నూతనంగా నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆరె కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థికి సన్మానం


విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దండేపల్లి, జూన్ 8 : దండేపల్లి మండలంలోని ద్వారక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న ఆవుల శశివీణ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించింది. ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున, నాలుగేళ్లకు మెరిట్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిన్న నర్సయ్య, ఎన్ఎంఎంఎస్ ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులున్నారు.

## కోదండరాం పరామర్శ

మందమర్రి, జూన్ 8: తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకుడు మందమర్రి పట్టణానికి చెందిన హన్మాండ్ల రవీందర్‌ను తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ పరామర్శించారు. రవీందర్ తల్లి ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న కోదండరామ్ శనివారం రవీందర్ ఇంటికి వచ్చి ఈశ్వరమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభులను పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకాలతో రాసిన పుస్తకాన్ని కోదండరామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి మండల నాయకుడు మందల శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

★I, DURGAM SWARUPA RANI, D/o. Durgam Durgaiah, R/o. H.No: 3-149/A, Kyathanpally, Mandamarri (M), Mancherial (Dist.), intended to Change My Daughter Name from KUMARI JANGAM DHRITHIKA to KUMARI DURGAM DHRITHIKA.
NT-334231

★I, DURGAM SWARUPA RANI, D/o. Durgam Durgaiah, R/o. H.No: 3-149/A, Kyathanpally, Mandamarri (M), Mancherial (Dist.), intended to Change My Daughter Name from KUMARI JANGAM CHAITHRIKA to DURGAM CHAITHRIKA.
NT-334231

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# భీమారంలో నకిలీ పత్తి విత్తనాల దందా !

- కరీంనగర్‌లో ప్రధాన సూత్రధారి అరెస్ట్‌తో వెలుగులోకి..
- పల్లెలకు చేరిన హెచ్‌టీ విత్తనాలు !
- అధికారుల పని తీరుపై విమర్శలు

భీమారం, జూన్ 8 : భీమారం మండలంలో నకిలీ విత్తనాల దందా గుట్టు రట్టయింది. హెర్బీసైడ్ టాలరెంట్ ( హెచ్‌టీ) నకిలీ విత్తనాలు చేరవేసే ప్రధాన సూత్రధారి ఆంధ్ర నాగేశ్వర్‌రావును కరీంనగర్ పోలీసులు గురువారం పట్టుకోవడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. ఆయన వద్ద నుంచి రూ. 1.20 లక్షల విలువైన 60 కిలోల నకిలీ విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెల క్రితమే నాగేశ్వర్‌రావు భీమారానికి నకిలీ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా భీమారానికి పెద్ద ఎత్తున విత్తనాలను దిగుమతి చేశారని సమాచారం.

**రైలు, ట్రాన్స్‌పోర్ట్ సర్వీసుల ద్వారా సరఫరా**

వాహనంలో తరలిస్తే పోలీసులు ఎక్కడ పట్టుకుంటారో అని తెలిసి, రైలు మార్గం ద్వారా, ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఐదు దఫాలుగా వందల కిలోల నకిలీ పత్తి విత్తనాలు చేరవేసి ఇక్కడ రైతులకు ఎక్కువ రేటుకు నాగేశ్వర్‌రావు అమ్ముకున్నట్లు తెలిసింది. ఆంధ్ర నాగేశ్వర్‌రావుకు భీమారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వందల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తాడు. ఆయనకు సన్నిహితంగా ఉండే మరి కొంత మంది కూడా ఇదే ఈ సీజన్‌లో ఇదే బిజినెస్ చేస్తుంటారు. తక్కువ ధరకు ఆంధ్రా రాష్ట్రంలో కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇక్కడ అమ్ముతుండడం వీరి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతున్నది.


ఈ నెల 6వ తేదీన కరీంనగర్‌లో నాగేశ్వర్‌రావు అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

కేసీఆర్ సర్కార్ హయాంలో ఇలాంటి వారిని సీజన్‌కు ముందే కేసులు నమోదు చేయడమేకాక బైండోవర్ చేశారు. కోటపల్లి మండల పోలీసులు సైతం భీమారంలోని బూర్గుపల్లిలో సోదాలు నిర్వహించి ఓ వ్యక్తి దగ్గర ఉన్న పత్తి విత్తనాలను పట్టుకున్నారు. రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు. శుక్రవారం, శనివారం భీమారంతో పాటు వివిధ గ్రామాల్లో దాడులు చేయగా ఎల్కేశ్వరం గ్రామంలో ఒక్కరి వద్ద 20 కిలోలు, మరొకరి వద్ద 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు దొరికినట్లు తెలిసింది. భీమారం మండలానికి గత నెల క్రితమే నకిలీ పత్తి విత్తనాలు వచ్చాయని ఆరోపణలు నిజమైనట్లయింది. నెల క్రితమే నకిలీ పత్తి విత్తనాలు వచ్చినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని, తనిఖీలు చేయకపోవడంపై మండల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో నకిలీ విత్తనాలు అమ్మే వారిని గుర్తించి పోలీస్‌లు ముందస్తుగానే బైండోవర్ చేసేవారు. కానీ ఈ సీజన్ బైండోవర్ చేయకపోవడంతో పాటు, కనీసం తనిఖీలు కూడా చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## ‘చెన్నూర్ ఎంతో అభివృద్ధి చెందింది’

- పట్టణ రూపురేఖలే మారిపోయాయి
- ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డ ఇద్దరు యువకుల మనోగతం

చెన్నూర్, జూన్ 8: చెన్నూర్ పట్టణం గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ ఐదు సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చిన ఇద్దరు యువకులు సంతోష్ పాల్గాడ్, హమదల్లాలు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం బొంబాయిలో ఉంటున్న సంతోష్ పాల్గాడ్, విజయవాడలో ఉంటున్న హమదుల్లాలు 1992-93 ఎస్సెస్సీ బ్యాచ్ తమ మిత్రులు ఏర్పాటు చేసిన గెట్ టూ గెట్ ప్రోగ్రాంలో తమ మిత్రులను కలుసుకునేందుకు చెన్నూర్‌కు వచ్చారు. వీరు 30సంవత్సరాల క్రితం చెన్నూర్‌లో ఇంటర్ వరకు చదివారు. ఆ తర్వాత సంతోష్ పాల్గాడ్ బొంబాయి, హమదుల్లా విజయవాడల్లో స్థిరపడ్డారు. వీరు అప్పుడప్పుడు తమ మిత్రులను కలుసుకునేందుకు చెన్నూర్‌కు వచ్చారు. ఐదేళ్ల తర్వాత తొలిసారిగా వీరు చెన్నూర్ పట్టణానికి వచ్చారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో జరిగిన సెంట్రల్ లైటింగ్, పార్కులు, ఫౌంటేన్లు, మిని ట్యాంకు బండ్లు లాంటి పలు అభివృద్ధి పనులను చూసి ఆశ్చర్యపోయారు. ఒక మంత్రి చేయనటువంటి అభివృద్ధిని ఎమ్మెల్యే బాల్క సుమన్ చేశారని, అఆలాంటి బాల్క సుమన్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏలా ఓడిపోయారా? అంటూ విస్మయం వ్యక్తం చేశారు.

**చెన్నూర్ రూపురేఖలే మారిపోయాయి..**



నేను ఇక్కడే పుట్టి పెరిగాను, ఇక్కడే ఇంటర్ మీడియట్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత బొంబాయి వెళ్లి అక్కడ స్థిరపడ్డాను. మా చిన్నప్పుడు చెన్నూర్ ఒక పల్లెటూరు వలే ఉండేది. చెన్నూర్ నుంచి వెళ్లి 30 సంవత్సరాలు అవుతుంది. మధ్యలో అప్పుడప్పుడు వచ్చే వాన్ని. కాని చెన్నూర్ అభివృద్ధి ఎలాంటి మార్పు కనబడేది కాదు. నేను తిరిగి ఆరేళ్ల తర్వాత వచ్చిన ఇప్పుడు చెన్నూర్‌లో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. పల్లెటూరులా ఉన్న చెన్నూర్ పట్టణంలా తయారైంది. ఇదంతా మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిండని తెలిసింది. ఇంత అభివృద్ధి చేసిన బాల్క సుమన్ ఎందుకు ఓడి పోయారో నాకు అర్థం కావటం లేదు.

**సంతోష్ పాల్గాడ్ (బొంబాయి)**

**బాల్క సుమన్ చాలా అభివృద్ధి చేసిండు..**



నేను చెన్నూర్‌లో ఇంటర్ వరకు చదువుకున్నాను. నేను అప్పుడప్పుడు మిత్రులను కలుసుకునేందుకు చెన్నూర్‌కు వచ్చేవాన్ని. అయితే మా మిత్రులు ఏర్పాటు చేసిన గెట్‌టూగెట్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు ఐదు సంవత్సరాల తర్వాత చెన్నూర్‌కు వచ్చాను. ఈ ఐదు సంవత్సరాల్లో చెన్నూర్ పట్టణంలో ఎవరు ఊహించనంతగా అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పటి వరకు మంత్రులు చేయలేని అభివృద్ధి పనులను ఎమ్మెల్యేగా బాల్క సుమన్ ఈ ఐదు సంత్సరాల్లో చేశారు. ఇంకా చెన్నూర్‌ను మరింతా అభివృద్ధి చేసుకునేందుకు ఇక్కడి ప్రజలు బాల్క సుమన్‌ను తిరిగి గెలిపించుకోవాల్సి ఉండేది. ఇంతా అభివృద్ధి చేసిన బాల్క సుమన్ ఓడిపోవటం చాల బాధకరం.

**-హమదుల్లా (విజయవాడ)**

## అటవీ శాఖ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు


అంకుసాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ రాంబాబు, ఎఫ్ఆర్‌వో రమాదేవి

కాగజ్‌నగర్, జూన్ 8: కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ గ్రామస్తులు అటవీ శాఖ అధికారులను శనివారం అడ్డుకున్నారు. అంకుసాపూర్ గ్రామ శివారులోని అటవీ శాఖ అధికారులు అటవీ శాఖకు సంబంధించిన భూమిలో హద్దులు ఏర్పాటుకు వెళ్లిన క్రమంలో గ్రామస్తులు అడ్డుకున్నారని ఎఫ్ఆర్వో రమాదేవి స్పష్టం చేశారు. దాదాపుగా 190 ఎకరాలు కబ్జా చేసి పోడు వ్యవసాయం చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ దాదాపుగా 30 ఏళ్లుగా భూమి సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నామని, తమ వద్ద పట్టా పాసుపుస్తకాలున్నాయని రైతులు చెప్పారు. ఈ క్రమంలో అటవీ శాఖ గ్రామస్తుల మధ్య వాగ్వాదం జరిగింది. రూరల్ సీఐ రాంబాబు ఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తులకు సమూదాయించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

# ముల్కల్లలో నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

హాజీపూర్, జూన్ 8 : నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని ముల్కల్ల వద్ద టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ లచ్చన్న లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న బైక్‌ను ఆపి తనిఖీ చేయగా 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలు కనిపించాయి. వాటిని తరలిస్తున్న కాసిపేట మండలం తుంగగూడేనికి చెందిన గుండవేణి రాజశేఖర్, నాసిపేల మండలంలోని ధర్మారావుపేటకు చెందిన ముచ్చెర్ల సంపత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విత్తనాల విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను హాజీపూర్ పోలీసులకు అప్పగించారు.


పట్టుకున్న నకిలీ విత్తనాలు, నిందితులతో పోలీసులు

# రాజీమార్గంతోనే సమస్యలు పరిష్కారం

- లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- సిర్పూర్(టీ) జూనియర్ న్యాయమూర్తి అజయ్


సిర్పూర్(టీ)లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి అజయ్ ఉల్లం

సిర్పూర్(టీ), జూన్ 8 : క్షణికావేశంలో పంతాలు, పట్టింపులకు పోయి కేసుల పాలై తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లలో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని సిర్పూర్(టీ), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికలపేట్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల పరిధిలోని మొత్తం 461 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గణపతి, గంట కల్యాణ్, సతీశ్, నియోజకవర్గంలోని మండలాల ఎస్ఐలు, కక్షిదారులు పాల్గొన్నారు.

## గ్రూప్ - 1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 8 : నేడు జిల్లాలో జరగనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2783 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు తెలిపారు.

**హాజీపూర్, జూన్ 8 :** నేడు నిర్వహించే గ్రూప్ 1 పరీక్షకు కళాశాలలో అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు హాజీపూర్ ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. మండలంలోని వేంపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఆర్ కళాశాల, ఎస్ఆర్‌కేఎం కళాశాలలను శనివారం పరిశీలించి కళాశాలతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అభ్యర్థులు అరగంట ముం దు పరీక్ష హాల్‌లోని చేరుకోవాలని సూచించారు. ఎంపీడీవో వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రతిభ తదితరులున్నారు.

## మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా పున్నంచంద్


పెద్దింటి పున్నంచంద్

కోటపల్లి, జూన్ 8 : మున్నూరుకాపు సంఘం కోటపల్లి మండల అధ్యక్షుడిగా సిర్సా గ్రామ మాజీ సర్పంచ్ పెద్దింటి పున్నంచంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం స్టేట్ కన్వీనర్ చింతపండు మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి రైతుల సమస్యల పరిష్కారానికి పున్నంచంద్ చేస్తున్న కృషికి గాను మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు వివరించారు. గ్రామాల్లో కమిటీలను నియమించి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పున్నం చెప్పారు.

## కొనసాగుతున్న బడిబాట


బాడిబాట ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూర్, జూన్ 8 : బడిబాట కార్యక్రమం శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ, బడీడు పిల్లల పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య


నాగేశ్ (ఫైల్)

కన్నెపల్లి, జూన్ 8 : మండలంలోని జజ్జరవెల్లి గ్రామానికి చెందిన వడుగూరి నాగేశ్ (30) అనే వ్యక్తి శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ,కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం నాగేశ్ అదే గ్రామానికి చెందిన విజయను గత ఆరు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య ఇక రాదనే మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి రఘురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

కోటపల్లి, జూన్ 8 : కోటపల్లి మండల రైతుల సౌకర్యార్థం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఏవో మహేందర్ తెలిపారు. 30 కిలోల బ్యాగ్‌పై 60 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాల బ్యాగ్‌ను అందించనున్నట్లు వివరించారు. జీలుగ విత్తనాల 30 కిలోల బ్యాగ్ హెకార్ట్‌కు సరిపోతుందని, ఆసక్తిగల రైతులు ఆధార్, పట్టాపాస్ పుస్తకంతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

## బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ


మాట్లాడుతున్న మండల వైద్యాధికారి రమేశ్

మందమర్రి, జూన్ 8: మందమర్రి పట్టణంలోని అర్బన్ ప్రాథమిక వైద్యశాలలో శనివారం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో బాలింతలకు బేబీ కిట్లను పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ జర్మియా బాలింతలకు బేబీ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల వైద్యాధికారి డాక్టర్ రమేశ్, డాక్టర్ అజయ్ మాట్లాడుతూ సీయస్ఐ చర్చి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, సూపర్‌వైజర్ కే.సురేఖ, అకౌంటెంట్ మోహన్, సభ్యులు రాజరత్నం, రాజశేఖర్, సునీల్, పద్మారావు, నవీన్, వినోద్, చరణ్, కమల్, సామ్యేల్ తదితరలు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత పాటించాలి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు


మెడికల్ కాలేజీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

హాజీపూర్, జూన్ 8 : మండలంలోని గుడిపేట గ్రామ శివారులో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ పనుల్లో నాణ్యతను పాటించాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. శనివారం మెడికల్ కాలేజీ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. రోడ్లు భవనాల శాఖ మంచిర్యాల డీఈ బావ్‌సింగ్, కళాశాల నిర్మాణ పనుల పర్యవేక్షణ జేఈ అనూష, కళాశాల ప్రాజెక్టు జనరల్ మేనేజర్ సంపూర్ణ రావుకు పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది మార్చిలోగా పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షులు తోట రవి, నాయకులు గోనె సతీష్ రావు, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

**దవాఖాన పనులు త్వరగా పూర్తి చేయాలి**

మంచిర్యాల ఏసీసీ, మే 8: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో దవాఖాన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు పలు చూచనలు చేశారు. ఆయన వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే.**

దండేపల్లి, జూన్8: దండేపల్లి మండలంలోని మేదరిపేటకు చెందిన మేకల సుమలత అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల ఎల్వోసీని వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గడ్డం నాగరాణి- త్రిమూర్తి, ఎంపీటీసీ కొంగల నవీన్‌కుమార్, నాయకులు చొప్పదండి రాజేశ్ ఉన్నారు.

## వృథాగా మిషన్ భగీరథ నీరు

దండేపల్లి, జూన్ 8 : దండేపల్లి మండలంలోని తాళ్లపేట గ్రామంలో పలుచోట్ల మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నది. ప్రధాన రోడ్డు వద్ద ఆంధ్రా హోటల్, అనిల్, రమేశ్ దుకాణాలు వద్ద నల్లాలు లేక విలువైన తాగునీరు వృథాగా పోతున్నది. లీకేజీలతో అన్ని కాలనీల్లో ప్రజలకు తాగునీరు అందకుండా పోతున్నది. ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి నల్లాలు లేని చోట నల్లాలు బిగించాలని, లీకేజీలు ఉన్నచోట్ల మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దొంగతనాల కేసులో ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అశోక్ కుమార్

మంచిర్యాల ఏసీసీ, మే 8: దొంగతనం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం మంచిర్యాలలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 1:15 గంటల సమయంలో హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామ సమీపంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు పోయే దారి వద్ద ఖమ్మం జిల్లా మధిర మండలం ఆత్కూర్‌కు చెందిన కంభంపాటి యెసోబు, ఆదిలాబాద్ ఖానాపూర్ సోనూర్ కాలనీ (సొంత గ్రామం), మహారాష్ట్ర యావత్మాల్ జిల్లా కేలాపూర్‌లో నివాసముంటున్న మమ్మడ్వార్ రాహుల్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని విచారించగా యెసోబు ఆరు నెలలుగా హాజీపూర్, లక్షెట్టిపేట, జగిత్యాల జిల్లాలలోని పలు మండలాల్లో తాళాలు వేసి వున్న ఇండ్లల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. బంగారం, వెండి ఆభరణాలను మమ్మడ్వార్ రాహుల్‌కు అందజేస్తుండగా ప్రత్యేక బృందంతో ఆ ఇద్దరిని పట్టుకున్నట్లు డీసీపీ తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోని వారి నుంచి 2 తు లాల బంగారం, 15 తులాల వెండి పట్టీ లు, రూ.2,44,660 నగదును జప్తు చేసి వారిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

- ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత



కొండపల్లి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి సునీత

రెబ్బెన, జూన్ 8: మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలికలు, మహిళల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఉపాధిహామీ మహిళా కూలీలకు మహిళా చట్టాలు, హింసకు గురైతే తీసువాల్సిన జాగ్రత్తలు, షీ టీం సేవలపై సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే షీ టీం లను సంప్రదించాలని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100 లేదా షీ టీం ఆసిఫాబాద్ నెంబర్ 8712670564 కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం దేవానంద్, సభ్యులు శ్రీలత, స్వప్న లు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ప్రజావాణి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 8: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేయబడిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీదారులు తమ దరఖాస్తులను అందజేయవచ్చని తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

రెబ్బెన, జూన్ 8 : రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ దీపక్ పేర్కొన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు మండలంలోని తుంగెడ, ధర్మారం గ్రామాల్లో తనిఖీ చేయగా 400 లీటర్ల బెల్లంపానకం లభ్యమైందని తెలిపారు. దాన్ని పారబోసినట్లు తెలిపారు. గుడుంబా తయారు చేసే వారి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ రమేశ్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేశ్, కమలాకర్, మమత, రజిత, సిబ్బంది ఉన్నారు.

## బర్రెను ఢీ కొట్టిన కారు

భీమారం, జూన్ 8 : భీమారం మండల కేంద్రంలో మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బర్రెను కారు ఢీకొట్టింది. చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న టీఎస్ 19బీ 1444లో వాహనం స్థానిక పెట్రోల్ పంపు వద్దకు రాగానే బర్రె ఎదురుగా రావడంతో ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. బర్రెకు గాయాలయ్యాయి.

## మహంకాళి ఆలయ అర్చకుడు వినోద్‌కు సన్మానం


దేవర వినోద్‌ను శాలువాతో సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

రెబ్బెన, జూన్ 8 : రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో కొలువైన కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయం అర్చకుడు దేవర వినోద్‌కు కొన్నేళ్లుగా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు నంది అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయనకు శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నంది అవార్డుతో పాటు ప్రశంసా ప్రతం అందించారు. అవార్డు వచ్చిన సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేను వినోద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను అభినందిస్తూ శాలువాతో కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ సన్మానించారు. ఓ వైపు ఆధ్యాత్మికతను ప్రజల్లో పెంచుతూ మరో వైపు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

## ముగిసిన అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న దేవర వినోద్

రెబ్బెన, జూన్ 8: రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో వేసవికాలం ప్రారంభం నుంచి చేపట్టిన ప్రారంభించిన అంబలి పంపిణీ కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయ అర్చకుడు దేవర వినోద్ తెలిపారు. ఇందిరానగర్ బస్టాండ్‌తో పాటు ఆలయ ఆవరణలో 41 రోజుల పాటు అంబలి పంపిణీ చేసినట్లు తెలిపారు. 6 సంవత్సరాల నుంచి ప్రతి వేసవికాలంలో అంబలి పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. అమ్మవారి కృపతో వచ్చే సంవత్సరం కూడా అంబలి పంపిణీ కొనసాగిస్తామని తెలిపారు.